## కామెడీ కథ:

ఆఫీసులో గుర్నాధం సీరియస్‌గా పన్జేసుకొంటుంటే 'టెలిగ్రాం' అన్న కేక వినపడింది. గుర్నాధం వినేసి తలెత్తకుండా పన్జేసుకొంటున్నాడు. అదే గుర్నాధం స్పెషాలిటీ. ఎవరు పిలిచినా చూడడు. వింటాడు. 'ఊ' కొడుతూ పని చేసుకుంటాడు. అందుకే గొప్పపన్జేసే వాడుగా గుర్నాధానికి పేరు. "నాధా వీకే టెలిగ్రాం" అని అరిచాడు సూపర్నెంటు. సూపర్నెంట్ అలా పిలిచినప్పుడల్లా గుర్నాధం గుర్రుగా ఓ చూపు విసురుతుంటాడు.

# నన్నాపొద్దు.....ప్లీజ్

-నందకిశోర్ దండమూడి

ఈసారి ఆచూపు టెలిగ్రాం మెసెంజర్ మీద విసిరి విసురుగా టెలిగ్రాం అందుకొని చదివి "ఆహా...భలే భలే. "అంటూ రెండు కాళ్ళూ నేల మీద చరుస్తూ సిన్మాలో బాబుమోహన్‌లా నవ్వాడు.

ఎప్పుడూ అలాసౌండ్ చేయని గుర్నాధాన్ని అందరూ పనిమానేసి మరీ వింతగా చూసి, మళ్ళీ పనుల్లో మునిగిపోయారు. మామూలుగా అయితే ఆ టైంలో అక్కడ జాతర జరిగేదే! కాని లోపల ఆఫీసరున్నాడు. అదీ సంగతి.

ఇంతకీ టెలిగ్రాంలో ఏముందో తెలీదుగాని గుర్నాధం మొహంలో ఆర్క్‌లైట్లు కొద్దిసేపు వెలిగాయి. ఆ తర్వాత మొహంలో రంగులుమారాయి. ఇబ్బందిగా సీట్లో అటు, ఇటూ కదిలాడు.

ఇక్కడో విషయం చెప్పేతీరాలి. బోల్డెంత ఆనందం కలిగినా, దుఃఖం వచ్చినా, గుర్నాధానికి కడుపులో పరిస్థితి 'ఉల్టాపుల్టా' అయిపోతుంది. ఇప్పుడూ అదే పరిస్థితి.

గడియారం వంక చూసుకున్నాడు. ఇంకో గంట గడిస్తేగాని ఆఫీసులోంచి బయటపడడం కుదరదు. 'ఏం చేయాలి?' అనే ఆలోచన్లోపడ్డాడు గుర్నాధం. గుర్నాధం బ్యాడ్‌లక్– ఎందుకంటే ఆఫీసులో టాయిలెట్స్ పడగొట్టేసి మళ్ళీ మోడ్రన్‌గా కట్టిస్తున్నారు. సో..గుర్నాధం తప్పని సరిగా 'మరోచోటు' వెతుక్కోవాల్సిందే!

నిమిషాలు గడుస్తున్న కొద్దీ పరిస్థితి విషమిస్తోంది.

అత్యవసర పరిస్థితి ప్రకటించక తప్పదనిపించింది గుర్నాధానికి.

లేచి బొడ్డుమీద (పాంటు మీద) చేయిపెట్టుకొని మెల్లగా ఆఫీసర్ ఛాంబర్ వైపు అడుగులేస్తున్నాడు గుర్నాధం.

ఆఫీసర్ ఛాంబర్ ప్రక్కనే సూపర్నెంట్ సీటు.


కొద్దిగా ముందుకు వంగి ఫ్యాంట్ మీద చేయిపెట్టుకొని వస్తున్న గుర్నాధాన్ని చూసి,

"ఏంటి? బాస్‌తో మాట్లాడాలా? అంత డైరెక్ట్‌మేటరా?" అడిగాడు సూపర్నెంటు.

"అవున్సార్! ఎమర్జెన్సీ మేటర్! చాలా డైరెక్ట్!!"

అన్నాడు గుర్నాధం మరో అడుగు ముందుకేసి.

"ఏంటీ! ప్యాంట్ బటన్ ఊడిపోయిందా?



అలా పట్టుకున్నావే? బాస్ దగ్గరికి అలా వెళ్ళితే అసయ్యంగా వుంటుంది" అన్నాడు సూపర్నెంటు మోహం అసయ్యంగా పెట్టి.

"థాంక్స్" అనేసి గుర్నాధం గబగబా ఛాంబర్‌లోకి దూసుకెళ్ళాడు.

అకస్మాతుగా లోపలి కొచ్చిన గుర్నాధాన్ని చూసి ఆఫీసర్ ఉలిక్కిపడ్డాడు. గుర్నాధాన్ని సడన్‌గా చూస్తే ఎవరైనా అంతే! ఈ పరిస్థితిలో మరీనూ! ఐనా కోపం రాలేదు ఆఫీసర్‌కి. గుర్నాధం మీద మాంచి ఇంప్రెషన్!

"ఎస్! గుర్నాధం! ఏంటి విష్షటి ఎమర్జెన్సీ ఫైలు రెడీ చేశావా!'

28.6.96 ఆంధ్రజ్యోతి చిత్ర వారపత్రిక

"చేశాన్సార్! సంతకాలకి మీ టేబుల్‌మీద వుంది" అన్నాడు గుర్నాధం.

"అలాగా! నేను చూడలేదే?" అంటూ ఆ ఫైలు కోసం వెతకడం మొదలెట్టాడు ఆఫీసరు.

గుర్నాధం కడుపులో ఫైరింగ్ ఆర్డర్స్ సిద్ధమవుతున్నాయి. రెండు క్షణాలాగి.

"సార్..-"అన్నాడు మెల్లగా

"ఏస్ ..ఆ ఫైలేదయ్యా?"

"ఫైల్ కంటే ఎమర్జెన్సీ సార్"

'ఏంటదీ?'

'అదేసార్ నా పరిస్థితి.. నా పరిస్దితి ఏం బాగోలేద్సర్'

"ఇప్పడు కుదరదయ్యా! నెలాఖరు రోజులు కదా! తర్వాత చూద్దాంలే ముందు మిగతా పనిచూడు" అన్నాడు ఆఫీసర్. ఆఫీసర్ దృష్టిలో గుర్నాధం అప్రకోసం వచ్చాడు.

గుర్నాధానికి ఎలా చెప్పాలో తెలియకపోయినా ఓ క్షణం తర్వాత బుర్ర తళుక్కున మెరిసింది. "సరేసార్! కాస్త పర్మిషనివ్వండి బైటికివెళ్ళి ట్రై చేసుకుంటా" అన్నాడు.

"సరేసరే.. రేపు పెందరాళేవచ్చేసేయ్" అన్నాడు ఆఫీసర్. గుర్నాధం గబగబ తన సీటు దగ్గరికొచ్చేసి అన్నీసర్దేసి బయలుదేరబోయి, ఉలిక్కిపడి, తలెత్తి చూశాడు.

ఎదురుగా సూపర్నెంటు.

"ఏంటా స్పీడూ? పొద్దున ఇచ్చిన వర్క్ ఇంకా పూర్తి చేయకుండావే చెక్కేస్తున్నావే? కుదరదు" అన్నాడు సూపర్నెంట్ బల్లమీద రెండు చేతులు గట్టిగా కొట్టి. "కుదరదంటే కుదరదుసార్ !బాస్ పర్మిషన్ కూడా ఇచ్చేశారు. వెళ్ళాలి వెంటనే వెళ్ళకపోతే పరిస్థితులు బాగుండవ్" అన్నాడు గుర్నాధం . "నువ్వెళ్ళిపోతే నా పరిస్థితి బాగుండదు గుర్నాధం! బాస్ చివాట్లేస్తాడు ప్లీజ్ ప్లీజ్" అంటూ గుర్నాధం గడ్డం పట్టుకొని బ్రతిమాలాడాడు సూపర్నెంటు.

"నా బాడీలో మైండ్ లేద్సార్..అది వేరే పనిలో వుంది. ...సారీ" అనేసి సూపర్నెంట్‌ని పక్కకి తోసేసి స్కూటర్ తీసుకొని రోడ్డుమీదకు వచ్చాడు గుర్నాధం.

. ఇంటికి వెళ్ళడానికి పావుగంట పడుతుంది. "అమ్మో అప్పటిదాకా ఆపుకోవడం కష్టమేమో దారిలో సులభ్ కాంప్లెక్స్‌లేవీ లేవు కూడా...ఏం చేయాలి?

అని అటూ ఇటూ దిక్కులు చూస్తుంటే ఓ సిన్మాహాలు కనిపించింది.

"అహా..ఏమి నా భాగ్యమూ" అంటూ గేట్ దగ్గరికి స్కూటర్‌ని పోనిచ్చి "తలుపు తీయ్" అన్నాడు.

"ఓ గంటాగు" అన్నాడు గేట్ కీపర్.

"అమ్మో గంటే ...ఇల్లే బెటర్.."అనుకొంటూ స్కూటర్ స్టార్ట్ చేస్తుంటే, క్లాస్‌మేట్ గోవిందరావు ఫ్యామిలీతో సహా ఎదురయ్యాడు. మరెప్పుడైనా ఎదురైతే ఎంతో ఆనందపడిపోయి బోల్డెంత అతిధిమర్యాదలు చేసేవాడే కాని... తెలుసు కదా..అందుకే చూసీ చూడనట్టు వెళ్ళిపోతుంటే.,

గోవిందరావు స్కూటర్‌కి అడ్డంగా వచ్చి నిలబడ్డాడు. గుర్నాధం వెర్రినవ్వు పులుముకొని అందరికీ విష్ చేశాడు. వెంటనే "వస్తానా! మళ్ళీ కలుస్తాన్లే" అని స్కూటర్ స్టార్ట్ చేయబోయాడు.

గోవిందరావు బలవంతంగా స్కూటర్ ఆపేసి 'సీకన్నీ తొందరే! లేటయితే టిక్కెట్లు దొరకవు. అంత కంగారెందుకు? ఆగు మా ఆవిడ్ని పంపించి టిక్కెట్లు తెప్పిస్తా" అన్నాడు.

గుర్నాధం 'సిన్మాలో బాబుమోహన్ చేత దెబ్బలు తిన్న కోట'లా ముఖం పెట్టి గోవిందరావు రెండు చేతులూ పట్టుకొని,

"గోవిందూ ఇవి చేతులు కావు. నేనేమి చెపలేను. నన్నర్థం చేసుకో. మరెప్పడైనా కలుస్తా. ప్లీజ్ " అనేసి గోవింద్ అండ్ ఫ్యామిలీకి బైబై చెప్పేసి సరాసరి ఇంటికి రయ్‌న వచ్చేశాడు గుర్నాధం. గుమ్మంలోనే ఎదురైంది గుర్నాధం భార్య.

"హమ్మయ్య వచ్చేశారా! మన బుజ్జిగాడికి పొద్దుట్నుంచీ విరోచనాలండీ! డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి. మీరు బట్టలు మార్చుకోకండి "అంది.

అప్పటికే గుర్నాధం పాంట్ సగం క్రిందకు జార్చేశాడు.

గుర్నాధం భార్యను పక్కకు తోసేసి సరాసరి టాయిలెట్స్ దగ్గరికి వెళ్లాడు. ఫ్యాంట్ పూర్తిగా తీసేశాడు. టాయిలెట్ తలుపు లోపల గడియ పెట్టివుంది.

ఎవడ్రా లోపల? కోపంగా గర్జించాడు గుర్నాధం. ఆ కేకకు దడుసుకున్న బుజ్జిగాడు ఏడుస్తూ బయటికి పరుగెత్తుకొచ్చాడు. గుర్నాధం భార్య కూడా ముందు గదిలోంచి పరుగెత్తుకొచ్చింది. గుర్నాధం తలుపు దభాల్న వేసేసుకున్నాడు. మూడు నిముషాల తర్వాత ప్రపంచాన్ని జయించిన తృప్తితో బయటికొచ్చాడు.

